# కుక్క

రాముకి చిన్నతనంలో తల్లి పోయింది. తండ్రి మళ్లీ పెళ్లి చేసుకున్నాడు.

లక్ష్మి సవతితల్లిగా ఆ ఇంట్లో అడుగు పెట్టిననాటికి రాముకు అయిదేళ్లు నిండాయి. వాడు చాలా తెలివైనవాడు. అప్పటికే వాడు మూడవ తరగతి చదువుతున్నాడు. రెండవ తరగతి నుంచీ వాడికి డైరీ రాసే అలవాటుంది. తల్లి పోగానే వాడి వ్యక్తిగత మనోభావాలెలాగుంటాయో తెలుసుకోవాలని తండ్రి వాడికి డైరీ రాసే అలవాటు చేశాడు. వాడికి తెలియకుండా డైరీ చదివి వాడి హృదయాన్ని తెలుసుకుంటూండేవాడు.

మొదట్లో రాముకి డైరీ ఎలా రాయాలో తెలిసేది కాదు. ఫలానా టైముకి లేచాననీ, ముఖం కడుక్కున్నాననీ, స్నానం చేశాననీ, ఫలానా బట్టలు వేసుకున్నానీ రాసేవాడు తండ్రి వాడికి డైరీలో మనోభావాల గురించి ఎలా రాయాలో నేర్పాడు. ఆ తరువాత కొన్నాళ్ళకు వాడి డైరీ లో తండ్రి ఊహించని మార్పు వచ్చింది.

రాము తండ్రి రంగారావు బ్యాంకులో గుమస్తా. జీతం బాగానే వస్తుంది. అతడికి బయట తిరగడం అలవాటు. పెళ్లయిన కొత్తలో కూడా బొత్తిగా ఇంటిపట్టున ఉండేవాడు కాదు. మొదటి భార్య ఈ విషయమై తరచు ఫిర్యాదు చేస్తూండేది.

రాము తన డైరీలో "ఇప్పుడు అమ్మొంటే ఎంతో సంతోషించేది. నాన్న ఆఫీసు వదలగానే ఇంటికొచ్చేస్తున్నాడు. నాతో ఎన్నో ఆటలాడుతున్నాడు. ఎంతో సరదాగా ఉంటోంది'' అని రాసుకుంటే రంగారావది చదివి కొడుకు ఊహాశక్తి కాశ్చర్యపడ్డాడు.

లక్ష్మి ఆ ఇంట ప్రవేశించినప్పుడు, "అందరూ కొత్తమ్మంటే భయపెట్టేస్తున్నారు. నాకు చాలా భయంగా ఉంది. కానీ ఈ అమ్మ అందంగా ఉంది. నన్ను చూసి నవ్వింది. ఎంత బాగుందో?'' అని రాసుకున్నాడు.

ఆ తరువాత కొన్ని రోజులపాటు వాడి డైరీలో కొత్తమ్మను గూర్చిన పొగడ్తలే ఉన్నాయి. రంగారావు తృప్తి చెంది క్రమంగా వాడి డైరీ చూడడం తగ్గించాడు.

లక్ష్మి ఆరంభంలో రాముని అభిమానించాలనే అనుకుంది. ఒక మామూలు కుర్రాడిగా రాములో ముచ్చటపడతగ్గ విశేషాలు చాలా ఉన్నాయి. కానీ క్రమంగా వాడిని చూస్తూంటే ఆమెకు రంగారావు మొదటి భార్య గుర్తుకు వచ్చేది. రాముది పూర్తిగా తల్లి పోలిక. ఎవరైనా రాము అందాన్నీ, తెలివినీ, చురుకుతనాన్నీ పొగిడితే లక్ష్మి మనసు కలుక్కుమనేది. వాడు 'అమ్మా' అని పిలిచినప్పుడల్లా ఆమెకేదోలాగుండేది.

క్రమంగా లక్ష్మిలో రాము పట్ల ద్వేషం ప్రారంభమయింది. అయితే ఆమె చదువుకున్న

ఆధునిక యువతి కావడం వల్ల తన ద్వేషాన్ని యథాతథంగా ప్రకటించేది కాదు.

రాము దస్తూరీ ముత్యాలకోవలా ఉంటుంది.

"మరీ అంత గుండ్రంగా రాస్తే ఆడపిల్లవనుకుంటారు. మా రాము అసలు సిసలు మగపిల్లాడిలా రాయాలి" అనేదామె. అందరూ మెచ్చుకునే తన దస్తూరీపై తల్లి తెచ్చిన అభియోగం వాడిపై ప్రభావం చూపకపోయినా మనసును నొప్పింపజేసింది.

లక్ష్మి వాడికి న్యూస్ పేపరిచ్చి చదవమనేది. అది వాడి కర్థంకాక పోతే పరిహాస పూర్వకంగా నవ్వేది. వాడి ముఖం చూసి ఆడపిల్లలా ఉంటావని ముద్దులాడేది. ఎన్నో విధాల వాడిని చిన్నబుచ్చడానికి ప్రయత్నించేది. ఎక్కడా వాడిపై కోపం చూపించేది కాదు.

ముఖ్యంగా తిండి విషయంలో ఆమె వాడిని బాగా ఏడిపించేది. వాడికిష్టమైన వంటకాలామెకు తెలుసు. అవి చేస్తానని వాడిని ఆశపెట్టి ఏదో సాకుతో అవి చేసేది కాదు.

రాముకు పాలకోవాలంటే ఇష్టం. ఒకసారి పాలకోవా చేస్తానని చెప్పి పాలు విరిగిపోయాయంది. అనవసరంగా పిల్లాడి నాశపెట్టానని బాధ నటించి బజార్నుంచి తెప్పిస్తానంది. పనిమనిషిచేత మైసూరుపాకులు తెప్పించి ఒకటి తెమ్మంటే ఇంకొకటి తెచ్చిందని అబద్ధం చెప్పింది.

రాముకి మైసూరుపాకులంటే అసహ్యం.

సవతితల్లి తన నేడిపిస్తోందని తెలియకవాడు డైరీలో తన దురదృష్టాన్ని నిందించుకునేవాడు. ఆమె వాడి డైరీ చదివి మానసికంగా ఆనందించేది.

ఒక రోజు ఆమె రాముతో మజ్జిగట్లు వేస్తానంది.

వాడికి మజ్జిగట్లంటే ప్రాణమని ఆమెకు తెలుసు.

పిండి తడిపిపెట్టింది. వాడు స్కూలుకు వెళ్లేక భర్తకు టిఫిన్‌గా చేసి పెట్టి ఆఫీసుకు పంపింది. రాము స్కూల్నించి తిరిగి రాగానే "త్వరగా బట్టలు మార్చుకుని రా - నీ కోసం మజ్జిగట్లు వేసి ఉంచాను" అంది.

రాము ప్లేట్లోని మజ్జిగట్లను కళ్ళారా చూశాడు. వాడి కప్పుడే నోట్లో నీళ్లూరిపోసాగాయి. కానీ ఇంటికి రాగానే బట్టలు మార్చుకుని కాళ్ళూ, చేతులూ, ముఖం కడుక్కోవాలని నియమం. వాడు వీలైనంత తొందరగానే ఆ పనులు పూర్తి చేసుకుని వచ్చేసరికి లక్ష్మి 'ఛీ ఛీ' అని గట్టిగా అరుస్తోంది.

"ఏమయిందమ్మా?" అన్నాడు రాము.

"దిక్కుమాలిన కుక్క..."అంది లక్ష్మి.

కుక్క ఇంట్లోకి చొరబడుతూండడం మామూలే.

"వెళ్ళిపోయిందా?" అనడిగాడు రాము.

"వెళ్ళిపోయింది. కానీ...." అంటూ ఆగి లక్ష్మి రాము వంక చూసింది.

వాడి ముఖంలో భయం, కంగారు, తొట్రుపాటు..

లక్ష్మి నెమ్మదిగా - 'వెధవ కుక్క - నీ కోసమని చేసిన మజిగట్లు స్వాహా చేసేసింది'

అంది.

"నిజంగా?" అన్నాడు రాము.

"ఊ.." అంది లక్ష్మి బాధ నటిస్తూ.

అప్పుడు రాము లక్ష్మి కేసి అదోలా చూశాడు. ఆ చూపులో సప్తర్షుల శాపాలున్నాయి.

తరువాత వాడు గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్లిపోయాడు. వాడేం చేస్తున్నాడో చూడాలని లక్ష్మి వాడిననుసరించింది. రాము మౌనంగా డైరీ రాసుకుని ఆటలకు వెళ్లిపోయాడు.

డైరీలో వాడేం రాశాడో చూడాలని లక్ష్మి కుతూహలపడింది. వాడేంరాశాడో చదివేసరికి ఆమెక్కలిగిన కోపమింతా అంతా కాదు. వంటికి చుట్టుకున్న ఎర్రచీర - ముఖాన్ని కూడా కప్పుతోందా అన్నంతగా ఎర్రబడిందామె ముఖం.

రాము ఇంటికి రాగానే చావబాదాలనుకుందామె. కానీ రాము కంటే భర్తే ముందుగా ఆఫీసు నుంచి వచ్చాడు.

లక్ష్మి డైరీని భర్తకు చూపించి, "చూడండి - మీ సుపుత్రుడెలా తయారయ్యాడో" అంది.

రంగారావాడైరీ చదివి ఆశ్చర్యపడ్డాడు.

"లక్ష్మీ! వాడు చాలా కసిగా ఈ డైరీ రాసి ఉండాలి. ఇంత కసి ఒక్క రోజులో పేరుకుపోదు. నీకూ వాడికీ మధ్య ఏదో జరుగుతోంది" అన్నాడు రంగారావు.

"బాగుంది. సవతి తల్లిని కదా - అన్నింటికీ నన్నే అనుమానించండి. ఈ రోజు మజ్జిగట్లు పెడదామనుకుంటే కుక్క తినేసింది అంతే. ఇక డైరీ సంగతంటారా - ఇంతవరకూ వాడు మాత్రం నా గురించి డైరీలో చెడ్డగా రాసుకున్నాడా?" అంది.

రంగారావు చకచకా రాము డైరీని తిరగేశాడు. అందులో సవతితల్లి గురించి ఎక్కడా చెడ్డగా రాయలేదు. కానీ తిండి విషయంలో తన దరదృష్టం గురించి తరచుగా రాసుకున్నాడు.

జరుగుతున్నది రంగారావుకు అర్థమయింది.

"లక్ష్మీ! రాము గుట్టయిన మనిషి. వాడికి నువ్వు కావాలనే తన నేడిపిస్తున్నావని ఎప్పుడో అర్థమయింది. అయితే తన డైరీని నువ్వూ నేనూ చదువుతామని వాడికి తెలుసు కాబట్టి జాగ్రత్తగా రాశాడు. ఈ రోజావేశం పట్టలేక మనం చదవాలనే ఆలా రాశాడు. చిన్నపిల్లల మనసులతో ఆడుకోకూడదు. నీకు వాడంటే ఇష్టం లేకపోతే చెప్పు - బోర్డింగు స్కూల్లో జేర్పించేస్తాను. దేనికీ నేను నిన్ను తప్పు పట్టను. ఇందులో తప్పంటూ ఉంటే నాదే! వాడిలో నీ వల్ల ఇంత కసి ఏర్పడి పెరుగుతూంటే గమనించలేకపోయాను..." అని, "ముందు వెళ్ళి ఆ ఎర్రచీర మార్చుకునిరా - నాకూ ఏమిటోలాగుంది" అన్నాడు రంగారావు.

లక్ష్మి చీర మార్చుకుందుకు వెడితే రంగారావు డైరీలోని వాక్యాలు మరోసారి చదువుకున్నాడు.

"కుక్కలు కూడా చీర కట్టుకుంటాయి. ఈ రోజు కుక్క కట్టిన చీర రంగు ఎరుపు." ★

*(ఆంధ్ర ప్రభ సచిత్ర వారపత్రిక -- 11-11-87).*